కథ



# పురిటికట్నం

తమ్మెర రాధిక

కొడుకు ఫోన్ చెయ్యంగానే సావిత్రమ్మ ముందుగా తయారు చేసి పెట్టుకున్నవన్నీ సర్థుకుంది. పాత చింతకాయ పచ్చడి, దోస వరగులు, వెల్లుల్లిపాయ కారం, కస్తూరిమాత్రలూ అన్నీ గుర్తుగా పెట్టుకుంది.

కోడలు సీతకు రెండో కాన్పు. డెలివరీ ఇంకో వారం వుందనగా సెలవలు పెట్టారు. కుమారు, సీతా. ఆమె స్కూలు టీచర్‌గా చేస్తోంది. ఆమెకు అనుకూలమనే మండల్ హెడ్ క్వార్టర్స్‌లో వుంటున్నారు. కుమార్ రోజూ పక్కన పల్లెటూరుకు పోయొస్తాడు. అతనూ గవర్నమెంట్ టీచరే. కొడుకు వుంటున్న ఇంటి చుట్టుపక్కల అంతా ఉద్యోగులే వుంటున్నారు. ఆడవాళ్లంతా కలుపుగోలువారే నంటాడు కుమార్. నాలుగు రూములు, చుట్టూ కాంపౌండు గేటు వున్న సెపరేటు ఇల్లు తీసుకున్నాడు.

బస్సు దగ్గరికి రానక్కరలేదని చెప్పి బైల్దేరింది సావిత్రమ్మ, ఇంటి ముందు ఆటో ఆగగానే అరుగుల మీద కూర్చున్న ఆడంగులు ఎవరిళ్లలోకి వాళ్లెళ్లిపోయారు. సావిత్రమ్మ రెండు బస్తాల సామానుతో దిగి చుట్టూ చూసింది.

లోపల పడక కుర్చీలో కూర్చున్న కుమార్ గబాల్న బైటకొచ్చి ఆటో వాడితో బస్తాలు లోపలికి పట్టించి పైసలిచ్చి పంపేశాడు. సీత అత్తగార్కి మంచి నీళ్లిచ్చి కాఫీ పెట్టడానికి భారంగా వంటింట్లోకి వెళ్తోంటే చూసింది సావిత్రమ్మ. నిండు చూలాలు.

"ప్రయాణం ఎట్లా అయ్యిందే అమ్మా?" కొడుకు మాటలకు తల వూపి, "డాక్టర్ ఏమన్నార్రా? పురుడెప్పుడు వస్తుందంటా?" అడిగింది సావిత్రమ్మ.

"ఇంకో వారం పడుతుందంటున్నారు. దానికేవో పెద్దాడితో, వంటపనితో ఆయాసంగా వుంది. రక్తం లేదుట" చెప్పాడు కుమార్.

సావిత్రమ్మకు ముగ్గురు కొడుకులు. కుమారు రెండోవాడు. ముగ్గురికీ పిల్లలు కలిగారు. అంతా పదేళ్లలోపు పిల్లలు. కుమార్ భార్య సీతకు రెండో కాన్పు ఆలస్యంగా అందటం వలన, చిన్న కోడలు కంటే రెండేళ్లు ఆలస్యంగా కాన్పు అవుతోంది. కోడళ్లిద్దరూ వచ్చి చూసిపోయారు, పురుడు కాగానే మళ్లీ వస్తామని చెప్పి వెళ్లారు. కుమారు అక్క మద్రాసులో వుండటం మూలాన, ఏకంగా బారసాలకే వస్తానని సీతకు ఫోన్ చేసి చెప్పింది. కోడలిచ్చిన కాఫీ చప్పరిస్తూ, ఆమె తల్లిదండ్రుల గురించీ, అన్నదమ్ముల గురించీ ప్రశ్నలేసింది. "పాత చీరలు పనికొస్తాయని పట్టుకొచ్చాను. నువ్వు నీళ్లాడాక అన్నంలోకి వేసుకుంటావని పాత పచ్చళ్లు తెచ్చాను. ఎక్కడ సర్దమంటావ్?" అడిగింది సావిత్రమ్మ. అత్తాకోడళ్లిద్దరూ కలిసి తెచ్చినవన్నీ సర్దుకున్నారు.

సీత బడికి సెలవు పెట్టింది. ఈ వారం రోజులూ ఆందోళన లేకుండా వుండాలని అనుకుంది. అందుకే ఆ విషయాన్ని అత్తగారికి చెప్పి రమ్మనమని అడిగింది.

సావిత్రమ్మ సంబారాలన్నీ మూటలు కట్టుకొని మూడోనాటికి దిగింది. వచ్చిందగ్గర్నించీ ఇల్లు సర్ది, పురిటికి ముందే చాకలికి బట్టలు వేసి ఉతికించింది. కొడుకుతో కట్టెలు తెప్పించి బాత్రూం పక్కన ఖాళీ స్థలంలో పొయ్యి వేసింది. సాంబ్రాణీ, చాదూ తయారు చేసింది. ఎందుకు హైరానా అని కొడుకు అన్నా, "హాస్పిటల్లో వారం రోజులైనా వుండమంటారు. మళ్లీ ఇంటికొచ్చి ఏవీ ముట్టుకోకుండా వుండేట్టు సర్దుకుంటే మంచిది కదరా!" అంటూ మాట దాటేసింది.

పురుడు రానే వచ్చింది. ఆడపిల్ల పుట్టింది. వారం రోజులూ ఇంట్లో వంట చేసుకొని, తను తిని, కొడుక్కూ, మనవడికీ పెట్టుకొని క్యారియర్ కట్టుకొని హాస్పిటల్ కొచ్చేది. మధ్యలో చూడ్డానికి వచ్చేపోయే చుట్టాలూ, మళ్లీ మళ్లీ వంటలు చెయ్యడం నానా హైరానాగా వుంది సావిత్రమ్మకు.

సీత దగ్గర వాళ్లమ్మ వుంది. ఆవిడ ఇంటికి రాననీ, చంటి పిల్ల, తల్లి దగ్గర ఎవరూ లేకపోతే కష్టమని దాటేసుకుంది.

"మీరొక్కరూ ఎంత కష్టపడుతున్నారు వదినగారూ! చంటి పిల్ల తల్లి కదా, దాని అవసరాలు మీరు చూడాలంటే ఇబ్బంది. బాత్రూంకు వెళ్లాలని అంటే మీరు తీసుకెళ్తే బాగుండదు కదా!" అంటూ, సావిత్రమ్మ తెచ్చిన క్యారేజీ విప్పుకు తింటుంటే ఏమీ మాట్లాడలేకపోయాడు కుమారు.

సోమవారం మంచి రోజు, మధ్యాన్నానికే తిథి మారుతోంది. ఆ లోపల బిల్లు కట్టి కోడల్ని తీసుకొచ్చేద్దామంది సావిత్రమ్మ. "సీతా, రేపు సోమవారం నిన్ను ఇంటికి పంపుతానన్నారు. నేను ఇంటి దగ్గరే వుండి అన్నీ రెడీ చేస్తాను. నువ్వూ, అమ్మా, కుమారూ రండి" అని ముందు రోజే చెప్పింది.

ఆదివారం రోజే ఇల్లు కడిగించి, కూరలూ, సామాన్లు తెప్పిం

చింది. మోడీ కారమనీ, పథ్యాల కారమనీ కొట్టించింది. కోడళ్లూ, కొడుకులూ వస్తున్నారని ఇల్లంతా సర్దించింది. తెల్లారేసరికి, అటు కొడుకులూ, కోడళ్లూ; కుమార్ మామగారూ, బావమరుదులూ దిగారు. ఇల్లంతా ఒకటే హడావిడి.

ఎనిమిది గంటలకంతా సీతని ఆటోలో తీసుకొచ్చారు. ఎర్ర నీళ్లు దిష్టి తీసి లోపలి గదిలో మంచంలో చంటి పిల్లని పడుకోబెట్టారు. సీత గదిలో పడుకుంది. కాసేపటికి తోటికోడళ్లు లోపలికి వస్తే వాళ్లతో మాట్లాడుకుంటూ కూర్చుంది. పెద్దకోడలు పురుడు గురించి చెప్తోంటే విని తల్లిని పిలిచింది, "అమ్మా!" అంటూ. ఆవిడ ఏవిటని కేక వేసింది బైట నుంచే.

"ఒక్కసారి లోపలికి రా" అంది.

ఆమె రావడం చూసి మిగతా వాళ్లు బైటకెళ్లిపోయారు, సీత తండ్రి తప్ప.

"రెండ్రోజుల్లో పురుడు చేస్తారట. మూడో నెల్లో ఉయ్యాల్లో వేసి నామకరణం చేద్దామనుకుంటున్నారు. మా పెద్ద తోడికోడలు ఇప్పుడే చెప్పి వెళ్లింది. అన్నయ్యా వాళ్లను గౌన్లు తెమ్మను" అంది.

"అయ్యో సంబడం! మీ అన్నయ్యకు ఎన్నిసార్లు ఫోన్లు చేస్తే ఇప్పుడొచ్చాడంటావ్? మీ వదినకు చేతకావడం లేదని వంకపెట్టుకొని పుట్టింటికి పోయింది. నువ్వయినా రారా అంటే చిన్నవాణ్ని తీసుకొనొచ్చాడు."

"ఇప్పుడేమంటావే?" విసుగ్గా అంది సీత.

"ఏం పెట్టినా బాలసారకేనే తల్లీ! వాణ్ని కదిలిస్తే అదో పెద్ద గోల" తేల్చేసింది ఆమె. సీత తండ్రి ఏమీ మాట్లాడలేకపోయాడు.

"అన్నయ్యల్ని రమ్మనమ్మా, నే చెబుతాను" అంది. తల వూపి ఆవిడ అవతలికెళ్లిపోయింది. సాయంకాలం అన్నలిద్దరూ సీత గదిలో కాసేపు కూర్చుని, పెరిగిన ధరల గురించీ, భారమైన సంసారం గురించీ మాట్లాడారు. సీత, కుమార్‌ల జీతాల గురించి ఆరా తీశారు. బారసాలకందరమూ వస్తామని చెప్పి వెళ్లిపోయారు.

వాళ్ల ధోరణి చూసి తను చెప్పాలనుకున్న పురిటి కట్నం గురించి భర్తతో అనలేకపోయింది. చంటిదానికో గౌనూ, తనకో జాకెటు ముక్కా, భర్తకో తువ్వాలూ. నీటికే లెక్కలు చూసుకున్నట్టుగా మాట్లాడుతున్నారు. వీళ్లు బారసాలకేం వస్తారు? అనుకుంది.

పురిటి రోజు సావిత్రమ్మ మంగలామెను పిలుచుకురమ్మంది, కుమార్‌ని. "ఈ బస్తీలో మంగలామెని ఎక్కడ వెతుకుతా?"నని ఆశ్చర్యపోయి, "ఇప్పుడామెతో పనేం?"టని ప్రశ్నించాడు తల్లిని.

"ఓర్నీ ఇల్లు బంగారం గానూ! మంగలామె ఎందుకంటావేందిరా నాయినా? పురుడు గదరా ఇవ్వాళ? ఏ మంగలి షాపుకైనా పోయి వాళ్లతో చెప్పు. నాలుగు డబ్బులిద్దాములే" అంది.

కుమార్ ఆమెను పిల్చుకొచ్చేసరికి, సావిత్రమ్మ కొత్త కుండల్లో అన్నం వండి, నాలుగు మంచం కోళ్ల దగ్గరా పెట్టింది. నీళ్లు కాగంగానే కోడళ్ల చేత, సీత తల్లి చేతా, తనూ అంతా కలిసి పదకొండు బిందెల వేడినీళ్లు పోశారు. బాలింత ప్రాణం సొమ్మసిల్లిపోయింది. వాయిలాకు వాసనతో ఒళ్లంతా హాయిగా వుంది.

సీత తోటి కోడలు అడుగుతోంది అత్తగార్ని, "అత్తయ్యా, పురుడు చేసినామెకు ఇప్పుడు కట్నం పెట్టొద్దూ? ఆ కట్నం మనమా లేక సీతావాళ్లమ్మగారు పెడ్తారా?"

ఆ మాటలు సీతా విన్నది. అత్తగారు ఏమంటుందోనని ఆసక్తిగా తలుపు దగ్గరికొచ్చి నిలుచుంది. సీత వెనుక ఆమె తల్లీ, కూతురు ఎందుకు నిలబడిందోనని వచ్చి చూసింది.

000

చాటలో బియ్యం పోసి చంటి పిల్లని దాన్లో పడుకోబెట్టి తీశారు. సీతని పీట వాల్చి కూర్చోబెట్టి, తోటికోడళ్లూ, అత్తగారూ, తలా ఒక గౌనూ, జాకెట్లు, తువ్వాలూ, కట్నం పెట్టి అక్షింతలేశారు. సీత తల్లి కోసం వాళ్లు, ఇంట్లో, బైటా ఎక్కడ చూసినా లేదు. తండ్రి చేసేది లేక, వందరూపాయలు వాళ్లకిచ్చి బొట్టు పెట్టి ఇవ్వమన్నాడు. సీత వదనం చిన్నబోయింది. కళ్లల్లో నీళ్లు కనపడకుండా కళ్లు వాల్చుకుని వంగి తండ్రి పాదాలకు దండం పెట్టింది. వంటైపోయింది. భోజనాలకు లేద్దామనుకుంటున్నంతలో, వచ్చింది హడావిడిగా సీత తల్లి బైట నించి.

"వదినగారూ, మొదలు మీరు రండి" అంటూ సావిత్రమ్మను చెయ్యి పట్టుకు పీట దగ్గరికి తీసుకువచ్చింది.

"ఛ..ఛ! ఏవిటవన్నీ వదినగారూ? ఇప్పుడు నాకెందుకు చెప్పండి" అంటూ సావిత్రమ్మ గింజుకున్నా, ఆవిడ వదలలేదు. చీరా, రవికెల బట్టా ఆమె చేతిలో పెట్టి దండం పెట్టి, "అమ్మాయి చల్లగా బైట పడేట్టు చేశారు. పిల్లా, తల్లీ గువ్వల్లా వున్నారంటే మీ చలవే" అంటూ మంగలామెను కూడా పిలిచి, కాటన్ చీరా, దక్షిణా చేతిలో పెట్టింది. ఆమె మొహం చాటంతైంది, సంతోషంగా దీవించి వెళ్లిపోయింది. సీతకు బట్టలు పెట్టడానికి భర్తను పిలిచి, యిద్దరూ కలిసి కట్నం పెట్టారు. సీత మనసులో ఆశ్చర్యపోయింది, ఇదంతా ఏంటోనని.

పురిటి రోజు సాయంత్రం అంతా వెళ్లిపోయారు. సావిత్రమ్మా, సీత తల్లీ-ఇద్దరే మిగిలారు ఇంట్లో. మనవరాల్ని పక్కలో వేసుకుని సావిత్రమ్మ పడుకుంది, అలిసిపోయి. పసిపిల్ల ఏడుస్తుంటే నడిమంచంలో కూర్చున్న సీత, ఒళ్లో చంటిదాన్ని పడుకోబెడుతూ లాలి పాట పాడుతున్న తల్లి కళ్లల్లోకి సూటిగా చూస్తూ అడిగింది-"కట్నాలు అందరికీ పెట్టావ్. ఎక్కడివమ్మా డబ్బులు, అన్నయ్య ఇచ్చాడా?"

నీరసంగా నవ్విందావిడ. "ఇప్పుడెందుకులేవే, దానికి పాలు సరిగా ఇవ్వు."

"ఇస్తాలేవమ్మా, ముందు చెప్పు" సీత రెట్టించింది.

గుమ్మం దగ్గర దగ్గిన చప్పుడైంది. ఇద్దరూ తిరిగి చూశారు. కుమార్! అన్నావదినల్ని బస్సు ఎక్కించి వస్తున్నట్టుంది. లోపలికెళ్లిపోయాడు.

"అన్నయ్య తన దగ్గిర డబ్బులు లేవన్నాడు. అసలిప్పుడు రారా అంటూ మా ప్రాణాలు తియ్యకపోతే మీరిద్దరూ వచ్చారు చాలదా? ఎంత తిరుగుడూ? ఎంత ఖర్చు, బారసాలెలాగూ తప్పదు. అటూ రుసరుసలాడాడు."

"మరి?"

"మీ తోటికోడలు పొద్దున్న నీ పురిటి స్నానమప్పుడు అడిగింది, గుర్తుందా?"

"ఏమని?"

"అదేనే, పురిటి కట్నం ఎవరు పెడ్తారని మీ అత్తగార్ని అడిగింది. అంతలోకి చంటిది ఏడవగానే, నువ్వు ఆమేమందో వినకుండానే లోపలి కెళ్లిపోయావు..."

"అవున్నిజమే. ఏమందేంటి?"

"అత్తింట్లో బిడ్డ పరువు ముఖ్యం. వాళ్లన్నయ్య ఖర్చా, గిర్చా నాకు చెప్పకు అంటున్నాడు. చూద్దాం ఏం పెడతారో! ఆమె తెలివి కలదైతే కాళ్ల పట్టాగొలుసులు అమ్మయినా తెచ్చిపెట్టాలి" అంది.

"అంత మాటందా?!" నిర్ఘాంతపోయింది.

"ఇంకో మాట కూడా అంది. వాళ్లకు పెద్దోడు పుట్టినప్పుడు మనమే పురిటి కట్నం పెట్టామన్న సంగతి గుర్తుంటే, ఇప్పుడు వాళ్లు పెట్టుకుంటారు అంది. అందుకే గబగబా మార్వాడీ కొట్టుకు పోయి, అవి అమ్మి పురిటి కట్నం పెట్టాను."

సీత కళ్లు గంగాప్రవాహాలయ్యాయి. ఎవర్నీ తప్పు పట్టలేదు. సంప్రదాయాలూ, చదివింపులూ ఏవీ తీసివేసేవి కావు. అత్తగారు విలువలకు ప్రాధాన్యమిచ్చే మనిషి. తల్లి ఆర్థిక సుడిగుండంలో కేంద్ర బిందువు. కొడుకుల్ని కాదని కూతురికి కట్నకానుకలు తేలేదు.

"ఈ పసిదాని కోసం..." సీత ఏదో అనబోయింది.

ఆవిడ నవ్వింది. "మరణించిన మా హృదయాలను బ్రతికించేది ఈ చిట్టితల్లుల పురిటి కట్నమేనే!" అంటుంటే, అమ్మమ్మ మాటలు నిజమేనని పసిది కళ్లు తెరిచి, మళ్లీ మూసుకుంది, అమ్మలకు రీప్లేస్‌మెంట్ లేదంటూ.